# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-10-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో భారీ వర్షాల దృష్ట్యా ప్రజలను అప్రమత్తం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**
2. **గ్రామీణ అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా "పల్లె పండుగ" వారోత్సవాలను రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తోందని ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ అన్నారు.**
3. **రాష్ట్రంలో మద్యం దుకాణాల లైసెన్సుల జారీ కోసం లాటరీ ప్రక్రియను ప్రభుత్వం నిర్వహిస్తోంది.**
4. **బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.**

===========================

రాష్ట్రంలో భారీ వర్షాల దృష్ట్యా ప్రజలకు ముందుస్తు సమాచారం ఇచ్చి అప్రమత్తం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులపై అమరావతి నుంచి ముఖ్యమంత్రి ఈ రోజు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధిక వర్ష ప్రభావమున్న ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలతో పాటు ఉమ్మడి చిత్తూరు, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లో అధికార యంత్రాంగాన్ని అప్రమత్తంగా ఉంచాలని, ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. అవసరమైతే తప్ప బయటకి వెళ్లకుండా విపత్తు నిర్వహణ శాఖ ద్వారా సందేశాలు, ఫోన్‌లు చేసి అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది, ఆస్తి నష్టం కలగకుండా ఉండేలా నిరంతరం కీలక శాఖలు సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

-------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి చిత్తూరు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, విశాఖపట్నం, బాపట్ల జిల్లాల్లో ఉదయం నుంచి వర్షం కురుస్తోంది. కొన్ని చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తిరుమలలో కురుస్తున్న భారీ వర్షంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల కారణంగా నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు, సముద్ర తీర ప్రాంత ప్రజలను ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. అలాగే ప్రకాశం జిల్లా, కృష్ణా జిల్లా, విశాఖపట్నంలోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి.

---

భారీ వర్షాల కారణంగా పొంగి పొర్లే అవకాశమున్న వాగులు, కాలువలను దాటవద్దని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ సూచించారు. ప్రజలను అప్రమత్తం చేసే సందేశాలను ఫోన్‌లకు విపత్తు శాఖ ద్వారా  ఎప్పటికప్పుడు పంపిస్తున్నామని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, తీగలు, చెట్లు, హోర్డింగులు వంటి ప్రమాదాలకు ఆస్కారముండే ప్రాంతాల్లోనూ అన్ని శాఖలు సమన్వయంతో  ముందస్తు చర్యలు చేపట్టామని  తెలిపారు.

---

గ్రామీణ అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు నుంచి “పల్లె పండుగ” వారోత్సవాలను రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తోంది.  పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 13 వేల 324 గ్రామాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. కృష్ణా జిల్లా కంకిపాడులో నిర్వహించిన పల్లె పండుగ వారోత్సవ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్యంతో గ్రామీణ స్థాయిలో వ్యవసాయం, నీటి పారుదల, రవాణా వ్యవస్థల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అన్నారు. ఈ నెల 20 వరకు కొనసాగే  ఈ వారోత్సవాల్లో  4 వేల 5 వందల కోట్ల రూపాయల నిధులతో 30 వేల పనులను చేపట్టనున్నామని ఉపముఖ్యమంత్రి తెలుపుతూ,

వాయిస్ (35 సెకన్లు)

---

రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఆబ్కారీ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు.  కలెక్టర్ల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే నేరుగా జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. లాటరీ సమయంలో దరఖాస్తుదారు హాజరు తప్పనిసరి కాదన్నారు. దరఖాస్తుదారు లేనప్పటికీ వారికి లాటరీ వస్తే అధికారులు సమాచారం అందజేస్తారని తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటనను విడుదల చేశారు.

---

రాష్ట్రంలో మద్యం దుకాణాల లైసెన్సుల జారీ కోసం లాటరీ ప్రక్రియను రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తోంది. 26 జిల్లాల పరిధిలో ఈ ఉదయం 8 గంటల నుంచే కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియను ప్రారంభించారు. జిల్లా గెజిట్‌లో ప్రచురించిన దుకాణాల క్రమసంఖ్య ప్రకారం లాటరీ తీస్తున్నారు. ఈ ప్రక్రియంతా దరఖాస్తుదారుల సమక్షంలోనే జరుగుతోంది.  ఈ సందర్భంగా పలువురు కలెక్టర్లు మాట్లాడుతూ,  దుకాణాల కేటాయింపు ప్రక్రియ కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేశామన్నారు. లాటరీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన మాట్లాడుతూ,

వాయిస్ ( 30 సెకన్లు)

---

అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఏజెన్సీలోని పర్యాటక ప్రాంతాల సందర్శనకు ఈరోజు నుంచి ఈ నెల 17వ తేదీ వరకు అనుమతులు లేవని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కె.సింహాచలం పేర్కొన్నారు. జిల్లాలో  తుపాను ప్రభావంపై  నిన్న  పాత్రి కేయులతో ఆయన మాట్లాడుతూ ఈ మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున పర్యాటకులు ఎవరూ రావద్దని సూచించారు.

---------------------------

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పార్వతీపురం శాసన సభ్యులు బి.విజయ్ చంద్ర తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతానగరం మండలం సుమిత్రాపురంలో నిర్వహించిన "పల్లె పండుగ" కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్ చంద్ర మాట్లాడుతూ, జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో జిల్లాలోని సుమిత్రాపురం నుండి వల్లరిగుడబ గ్రామం వరకు రెండు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న బి.టి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. "పల్లె పండుగ" కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల్లో కచ్చా రోడ్లు, నీటి సంరక్షణ గుంతలు, గోశాలలను నిర్మించనున్నామని తెలిపారు.

---------------------------

గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం "పల్లె పండుగ" కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలోని గోరింటాడా, సగం చెరువు గ్రామాల్లో అభివృద్ధి పనులకు మంత్రి నిమ్మల రామానాయుడు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమ వివరాలను మా ఆకాశవాణి పశ్చిమ గోదావరి జిల్లా ప్రతినిధి ఐ.సుబ్బారావు అందజేస్తారు.

వాయిస్ ( 35 సెకన్లు)

---------------------------

విజయనగరం పైడితల్లి అమ్మవారి తొలేళ్ల సంబరాలు ఈ రోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా కేంద్ర మాజీ మంత్రి, ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకొని పట్టువస్త్రాలు సమర్పించారు. విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, స్థానిక శాసనసభ్యురాలు అదితి గజపతిరాజు పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలని అమ్మవారిని కోరుకున్నట్లు చెప్పారు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని విశ్వవిద్యాలయల్లో 2023-24 విద్యా సంవత్సరానికి గానూ పీహెచ్ డి ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీరీసెట్ అడ్మిషన్ల ప్రక్రియ ఈరోజు నుంచి ప్రారంభమైందని సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పి.సి. వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ విభాగాల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు సంబంధిత విశ్వవిద్యాలయాల్లోని అడ్మిషన్ల కార్యాలయాల్లో ఈ రోజు నుంచి ఈనెల 19లోపు సంప్రదించాలని సూచించారు.

---------------------------

వినియోగదారురులకు వస్తు ఉత్పత్తులు, సేవల నాణ్యత పట్ల అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈరోజు ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచ వినియోగదారులకు ప్రామాణికమైన, నాణ్యమైన వస్తు ఉత్పత్తులను అందించేందుకు చట్టబద్దమైన అధికారాల ద్వారా నిర్దేశించేందుకు 1946లో అక్టోబర్ 14వ తేదీన లండన్‌లో అంతర్జాతీయ ప్రామాణీకరణ సంస్థ ఏర్పాటైంది. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా అక్టోబర్ 14వ తేదీన ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

======================